క్లుప్తంగా

నట యశస్వి ఎస్వీ రంగారావు



విజయవాడ కల్చరల్: నట యశస్వి సినీ నటుడు ఎస్వీ రంగారావు అని కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు కొనియాడారు. కళామంజరి సాంస్కృతిక సేవా సంస్థ, సి.రామ్మోహనరావు కల్చరల్ అకాడమీ ఆధ్వర్యాన సోమవారం తుమ్మపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రం వద్ద ఎస్వీ రంగారావు 105వ జయంతి వేడుకలను నిర్వహించారు. అడపా శేషు మాట్లాడుతూ తెలుగు జాతి గర్వించే మహోన్నత నటుడు ఎస్వీఆర్ అని అభివర్ణించారు. కళామంజరి వ్యవస్థాపకుడు పీవీఎల్ నృసింహం మాట్లాడుతూ ఎస్వీఆర్ నటించిన నర్తనశాల తొలి సారిగా విదేశాల్లో ప్రదర్శించినట్లు గుర్తు చేశారు. వివిధ సంస్థల ప్రతినిధులు చినుకు హరగోపాల్, బడేటి ధర్మారావు, ఉప్పు రంగ ప్రసాద్, పెన్నారు దామోదరం, ఇ.వాసు, మాంతి రమణ ఎస్వీఆర్ నట సేవలను వివరించారు. అతిథులు ఎస్వీఆర్ విగ్రహానికి పూలదండలు వేసి అంజలి ఘటించారు.

మహనీయులను స్మరించుకోవాలి



విజయవాడ కల్చరల్: జాతికి స్ఫూర్తినిచ్చిన మహనీయులను స్మరించుకోవాలని సినీ నటుడు త్రిపురనేని గోపీచంద్ అన్నారు. భాషా సాంస్కృతిక వైభవంలో భాగంగా సోమవారం నగరంలోని విక్టోరియా మ్యూజియంలో పింగళి వెంకయ్య విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ జాతీయపతాక రూపశిల్పి పింగళి వెంకయ్యకు కూడా జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాల్సిన అవసరముందన్నారు. భాషతోనే జాతి మనుగడ సాగుతుందన్నారు. కార్యక్రమంలో సాహితీవేత్త గోళ్ల నారాయణరావు, వెంకటేశ్వరరావు, ప్రపంచ తెలుగు రచయితల సంఘం గౌరవ అధ్యక్షుడు మండలి బుద్ధప్రసాద్ పాల్గొన్నారు.

శాకంబరిగా శ్యామలాదేవి



మధురానగర్(విజయవాడసెంట్రల్): దావు బుచ్చయ్య కాలనీలోని శ్రీ శ్యామలాంబదేవి దేవాలయంలో పౌర్ణమి సందర్భంగా సోమవారం అమ్మవారిని శాకంబరీదేవిగా అలంకరించి పూజలు చేశారు. అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చనలు, శ్రీచక్రార్చనలు జరిగాయి. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త చింతపల్లి కనకారావు పర్యవేక్షించారు.

■ మధురానగర్ నేతాజీ కాలనీలోని శ్రీ అంకమ్మ శక్తిపీఠంలో మూడు రోజులుగా జరుగుతున్న శాకంబరీ ఉత్సవాలు సోమవారం ముగిశాయి. పెద్ద సంఖ్యలో మహిళలు అమ్మవారిని దర్శించుకుని సారె సమర్పించారు. పీఠం వ్యవస్థాపకుడు అన్నాబత్తుల శరాబందీరావు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): శాకంబరీ ఉత్సవాల సందర్భంగా పౌర్ణమిరోజున సోమవారం సత్యనారాయణపురంలోని కాశీవిశ్వేశ్వరస్వామి వారి దేవస్థానంలో కొలువైయున్న అన్నపూర్ణదేవిని శాకంబరీగా భక్తులకు దర్శనం ఇచ్చారు. రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు స్థానిక కార్పొరేటర్ శర్వాణిమూర్తితో కలసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొల్లూరు రామకృష్ణ, వైఎస్సార్ సీపీ 33వ డివిజన్ కోఆర్డినేటర్ దోనేపూడి శ్రీనివాస్, శనగవరపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు నిర్మూలనకు బాధ్యతగా పనిచేయాలి



కంకిపాడు: కుష్ఠు వ్యాధి నిర్మూలనకు బాధ్యతతో పనిచేయాలని జిల్లా లెప్రసీ అధికారి వెంకటరావు సూచించారు. ఉప్పలూరు గ్రామంలో కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వేను ఆయన సోమవారం పరిశీలించారు. ఇంటింటి సర్వే, వ్యాధి నిర్ధారణ అంశాలపై ఆరోగ్య సిబ్బంది సేకరిస్తున్న వివరాలకు సంతృప్తి వ్యక్తం చేశారు. వెంకటరావు మాట్లాడుతూ స్పర్శ లేని మచ్చలను కుష్ఠు లక్షణంగా గుర్తించాలన్నారు. డీఎస్ఎంఓ వేణుగోపాలకృష్ణ, వైద్యాధికారి డాక్టర్ సుందర్‌కుమార్, డీపీఎంఓ శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్ రాచమళ్ల శ్యాంప్రసాద్, ఏఎన్ఎం భవాని, ఆశ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు



అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరి పీఠంలో సాయినాథుడికి అభిషేకం

మధురానగర్(విజయవాడసెంట్రల్): గురుపౌర్ణమి వేడుకలు సోమవారం సెంట్రల్ నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు బాబా మందిరాల వద్ద బారులు తీరారు. సాయినాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. ముత్యాలంపాడు బాబా మందిరంలో గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. బాబాకు ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. ఎమ్మెల్యే మల్లాది విష్ణు ప్రత్యేక పూజలు చేశారు. ఎంతో మహిమాన్వితమైన బాబావారి ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలని ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. మధ్యాహ్నం సుమారు ఆరు వేల మందికి దాత కుంచనపల్లి రవిశంకర్ దంపతులతో అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షులు పి.లక్ష్మణరావు, కార్యదర్శి కె.రవి శంకర్, కోశాధికారి ఎం.సత్యశ్రీహరి తదితరులు పర్యవేక్షించారు.

■ పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో బాబాకు విశేషంగా అభిషేకాలు అర్చనలు జరిగాయి. వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి తోట శ్రీనివాస్ బాబాను దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం మందిర వ్యవస్థాపకుడు తంగెళ్లమూడి వీరమోహనరావుతో కలిసి సుమారు 5 వేల మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో 61వ డివిజన్ వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షులు బల్లం కిషోర్, తోట భాస్కర్, ఫణికుమార్, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

■ అయోధ్యనగర్ శ్రీ దత్తసాయి శివకామేశ్వరీపీఠంలో శ్రీధర్మపరిషత్ మహాసంస్థాన్ ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు అభిషేకాలు జరిగాయి. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకులు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు.

■ చుట్టుగుంటలోని శ్రీ కల్యాణ సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమాలను ఆలయ వ్యవస్థాపకుడు మధుసూధనరావు పర్యవేక్షించారు.

■ మధురానగర్‌లోని శ్రీభగవాన్ షిరిడీ సాయిబాబా మందిరంలో ఎమ్మెల్సీఅశోక్ బాబు బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమాలను మందిర గౌరవాధ్యక్షురాలు పిల్లి లక్ష్మీతులసి, పీవీఎల్ఎస్‌రాజు, వైవీ శివాజీ, బాలవర్ధనరావు పర్యవేక్షించారు.

■ **గాంధీనగర్(విజయవాడసెంట్రల్):** లెనిన్ సెంటర్‌లోని ఓం షిర్డీసాయిబాబా– నాగసాయిబాబా ఆలయంలో గురు పూర్ణిమ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు సుధాస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. వివిధ రకాల పూలతో బాబాను అభిషేకరించారు. వేడుకల్లో పాల్గొన్న సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు బాబాను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. బాబా భక్తులు తోట రామారావు వెంకటలక్ష్మి దంపతులు ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. బాబా పల్లకీసేవలో పాల్గొన్నారు.

■ **గాంధీనగర్(విజయవాడసెంట్రల్):** శారద జూనియర్ కళాశాలలో శారద ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో గురు పూజోత్సవం నిర్వహించారు. డాక్టర్ జంధ్యాల పరదేశీబాబును సత్కరించారు. ప్రిన్సిపాల్ నాగేశ్వరశర్మ, ఎల్ శ్రీధర్, కార్యదర్శి కుందా సీతారామశాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): గురుపౌర్ణమి సందర్భంగా సింగ్‌నగర్ ఆంధ్రప్రభకాలనీలోని శ్రీషిర్డీసాయిబాబా మందిరంలో త్రిమూర్తి స్వరూప సద్గురు సాయినాథునికి 121 కేజీల పంచదారతో మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు, అన్నదానాలు చేశారు.

సింగ్‌నగర్ 100 రోడ్డులోని అల్లూరి జంక్షన్ వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు జలసూత్రం శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీనివాస్, ఆదిలక్ష్మీ దంపతులు బాబా వారికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం 2000 మంది భక్తులకు అన్నదానం చేశారు. అంబాపురం సర్పంచ్ గండికోట సీతయ్య, మాజీ సర్పంచ్ గొడ్డల్ల చిన్నరామారావు, తదితరులు పాల్గొన్నారు. స్థానిక 57వ డివిజన్‌లోని న్యూరాజరాజేశ్వరీపేటలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే మల్లాది విష్ణు, కార్పొరేటర్ ఇసరపు దేవి తదితరులు పాల్గొన్నారు.



ముత్యాలంపాడు సాయి మందిరంలో జరిగిన పూజల్లో ఎమ్మెల్యే మల్లాది విష్ణు



శ్రీదత్తసాయి మందిరంలో ..



ముత్యాలంపాడులో అన్నప్రసాద వితరణ



డాక్టర్ జంధ్యాల పరదేశీబాబును సత్కరిస్తున్న కళాశాల సిబ్బంది

పేదరిక నిర్మూలనకు సంక్షేమ పథకాలు



గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు, కార్పొరేటర్ అనిత

లబ్బీపేట(విజయవాడతూర్పు): పేదరిక నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని సెంట్రల్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్లానింగ్‌బోర్డు ఉపాధ్యక్షులు మల్లాది విష్ణు అన్నారు. నియోజకవర్గంలో చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం 24వ డివిజన్‌లోని 36వ సచివాలయం పరిధిలో కృష్ణారావు వీధి, రామనాథం వీధుల్లో విస్తృతంగా పర్యటించారు. కార్పొరేటర్ కుక్కల అనితతో కలిసి గడప గడపకు వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. యూజీడీ వ్యవస్థను మెరుగుపర్చాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. కృష్ణారావు వీధి, రామనాథం వీధుల్లో రోడ్ల నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పేదలందరికీ ఇళ్ల పథకం తొలి దశ నిర్మాణంపై లబ్ధిదారులకు అవగాహన సదస్సులు నిర్వహించాలని యూసీడీ అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ దేశంలోనే గొప్ప మనసున్న నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం అధికారుల్లో జవాబుదారీతనాన్ని పెంచిందన్నారు. నవరత్నాల ద్వారా నాలుగేళ్లలో రూ. 2.16 లక్షల కోట్లు అక్కచెల్లెమ్మల ఖాతాల్లో జమచేసినట్లు వెల్లడించారు. మేనిఫెస్టోలో ఎన్ని హామీలు నెరవేర్చారో చెప్పుకోలేని స్థితిలో చంద్రబాబు ఉన్నారని మల్లాది విష్ణు విమర్శించారు. కార్యక్రమంలో ఏఎంహెచ్ఓ రామకోటేశ్వరరావు, సీడీఓ జగదీశ్వరి, నాయకులు కుక్కల రమేష్, కొమ్ము చంటి, మోజెస్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానజ్యోతిని వెలిగించేది గురువు



సంగీత, సాహితీ వేత్తలకు సత్కారం

విజయవాడ కల్చరల్: జ్ఞానజ్యోతిని వెలిగించేది గురువని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. సంస్కారభారతి సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్ కొత్తా పూర్ణానందం కళావేదికమీద సోమవారం గురుపౌర్ణమి సందర్భంగా నటరాజ పూజ, సాంస్కృతిక కార్యక్రమాలు, దేశభక్తి గేయాలు, సంగీత సాహిత్యరంగంలో లబ్ధప్రతిష్ఠులైన వారికి ఆత్మీయ సత్కారం చేశారు. మల్లాది విష్ణు మాట్లాడుతూ గురు సంప్రదాయాన్ని కాపాడుకోవాల్సిన అవసరముందన్నారు. సంస్కారభారతి విజయవాడ మహానగర్ అధ్యక్షుడు విజయభాస్కర శర్మ సంస్థ లక్ష్యాలను వివరించారు. న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా సంస్కారభారతి సంస్థ యువతలో ప్రతిభను గుర్తించి వెలుగులోకి తీసుకొస్తోందన్నారు. సంస్కారభారతి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పీవీఎస్ కృష్ణ ఆధ్వర్యంలో అచ్చతెలుగు అవధాని డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, సంగీత విద్వాంసుడు పోపూరి గౌరీనాథ్‌లను సత్కరించారు.

సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా సంగీత కళాశాల నృత్యవిభాగం అధ్యాపకుడు అజయ్‌కుమార్ బృందం సంప్రదాయ నృత్యాలను, గౌరీనాథ్ బృందం దేశభక్తి గీతాలను, డాక్టర్ పీవీఎస్ కృష్ణ బృందం ఏకపాత్రాభినయం కార్యక్రమాలను ప్రదర్శించారు. సంస్కారభారతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీఎస్ శ్రీనివాస్, నగర ప్రధాన కార్యదర్శి సీహెచ్ సీతారత్నం, సభ్యులు పాల్గొన్నారు.

■ పుష్పాంజలి రిథమ్స్ ఆధ్వర్యంలో హనుమంతరాయ గ్రంథాలయంలో గురుపూర్ణిమ వేడుకలను నిర్వహించారు. డాక్టర్ చల్లా హరికుమార్ ఆధ్వర్యంలో గాయకుడు, తెలుగు సినీ పాటల పరిశోధకుడు బాలాజీకుమార్ దంపతులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కొత్తా పూర్ణానందం విలాస్‌లోని రంగస్థల ఐక్యవేదిక కార్యాలయంలో పరబ్రహ్మాచారి, నాగేశ్వరరావు, సూర్యనారాయణను సత్కరించారు. రంగస్థల కళాకారుల సమాఖ్య అధ్యక్షుడు గుమ్మడి జీవన్‌కుమార్, ప్రధాన కార్యదర్శి అగురు త్రినాథాచారి పాల్గొన్నారు.

సంతృప్తికరంగా పరిష్కారాలను అందించండి



స్పందనలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్

వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్‌పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): స్పందన కార్యక్రమంలో అందుకున్న విజ్ఞప్తులకు సంతృప్తికరంగా పరిష్కారాలు అందించాలని, సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. వీఎంసీ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన స్పందన వేదికలో కమిషనర్ పాల్గొని వివిధ సమస్యలపై వచ్చిన 7 ఫిర్యాదులను సంబంధిత విభాగం అధికారులకు తెలియజేసి గడువులోపు నాణ్యమైన పరిష్కారం అందించాలని ఆదేశించారు. సోమవారం నిర్వహించిన స్పందనలో పట్టణ ప్రణాళిక విభాగం–2, ఇంజినీరింగ్ విభాగం–5 వినతులు అందాయి. జగనన్నకు చెబుదాం 1902, స్పందన, అవర్ వీఎంసీ పోర్టల్‌లను నగరపాలక సంస్థ అన్ని విభాగాల ఉన్నతాధికారులు ప్రతిరోజూ పరిశీలించుకోవాలని, ఫిర్యాదులు పెండింగ్‌లో లేకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు కార్యక్రమంలో అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి సత్యవతి, చీఫ్ ఇంజినీర్ ప్రభాకరరావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, సిటీ ప్లానర్ జి.వి.జి.ఎస్.వి ప్రసాద్, డెప్యూటీ కమిషనర్ (రెవిన్యూ) డి.వెంకటలక్ష్మి, ఎ.డి.హెచ్ శ్రీనివాసు, మేనేజర్ బి.శ్రీనివాస్ రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సర్కిల్ కార్యాలయాల్లో స్పందన్ అర్జీలు– 1

సర్కిల్ కార్యాలయాలలో జోనల్ కమిషనర్లు స్పందన కార్యక్రమము నిర్వహించగా చిట్టినగర్‌లోని సర్కిల్ -1 కార్యాలయంలో పట్టణ ప్రణాళిక విభాగానికి - 1 అర్జీ, సత్యనారాయణపురంలోని సర్కిల్ - 2, పటమటలోని సర్కిల్ -3 కార్యాలయంలో అర్జీలు రాలేదని జోనల్ కమిషనర్లు తెలిపారు.

వృద్ధులకు సేవ చేయడం గొప్ప విషయం



ఆశ్రమ నిర్వాహకులకు చెక్కు అందిస్తున్న పద్మాలయ, సుజాత, తదితరులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వృద్ధులకు సేవ చేయడం గొప్ప విషయమని లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ సుప్రీం వైస్ ప్రెసిడెంట్ పద్మాలయ అన్నారు. వాంబేకాలనీలోని మాతృదేవోభవ వృద్ధాశ్రమానికి రూ. 2 లక్షల ఆర్థిక సాయాన్ని సోమవారం అందించారు. ఆపదలో ఉన్న వారికి, పేదరికంతో కష్టాలు ఎదుర్కొంటున్న వారికి సాయం చేయడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మాతృదేవోభవ వృద్ధాశ్రమంలో సపర్యలు చేయడం సంతోషంగా ఉందన్నారు. సంస్థ నిర్వాహకులు దుర్గ మాట్లాడుతూ మారుమూల ప్రాంతంలో ఉన్న మా వృద్ధాశ్రమాన్ని గుర్తించి, ఇంత పెద్ద సాయం చేయడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం దాత పద్మాలయ, ఆమె కుమార్తె సుజాతలను ఆశ్రమం నిర్వాహకులు, లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ సుప్రీం సభ్యులు ఘనంగా సన్మానించారు.

అలరించిన ఆంధ్ర నృత్య ప్రదర్శన



కళావేదికపై నృత్యాభినయం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): 'దర్మపథం'లో భాగంగా ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో పలువురు కళాకారులు ఆంధ్ర నాట్య ప్రదర్శన ఇచ్చారు. ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం ఎదుట కళావేదికపై శ్రీ నటరాజ నృత్యాలయానికి చెందిన నాట్యాచార్య రాయన శ్రీనివాసరావు బృందం ఆంధ్ర నృత్య ప్రదర్శన చేసింది. నృత్యాలయానికి చెందిన పలువురు చిన్నారులు పలు కీర్తనలకు నాట్య ప్రదర్శన చేశారు. అనంతరం వారు అమ్మవారి దర్శనం చేసుకున్నారు.

కనుల పండువగా శ్రీనివాస కల్యాణం

పెనమలూరు: మండలంలోని పోరంకి గ్రామం విష్ణుపురంకాలనీలో వేంచేసి ఉన్న శ్రీ విజయ వినాయకస్వామి దేవస్థానంలో ఆదివారం రాత్రి శ్రీ శ్రీనివాస కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరిగింది. ఆగమ పండితుడు హరినవీన్, శిష్య బృందం శాస్త్రోక్తంగా శ్రీనివాస కల్యాణాన్ని నిర్వహించారు. తొలుత సుప్రభాతసేవ, తోమాలసేవ, తులసీ దళాలతో సహస్ర నామార్చన, హోమం, పలు పూజా కార్యక్రమాలు చేశారు. ఆదివారం రాత్రి 9 గంటలకు శ్రీనివాస కల్యాణ మహోత్సం అత్యంత వైభవంగా చేశారు. భక్తులు కల్యాణ మహోత్సవంలో పాల్గొని కనులపండుగగా తిలకించారు. కాలనీ పాలక వర్గంతో పాటు, కాలనీ వాసులు, గ్రామస్తులు భక్తులు ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సత్వర సేవలు

రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు



జగనన్న సురక్ష శిబిరంలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజలకు సత్వర సేవలు అందుతున్నాయని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. ప్రజల వద్దకే అత్యంత పారదర్శకంగా పరిపాలన తీసుకువచ్చే గొప్ప కార్యక్రమమని తెలిపారు. 25వ డివిజన్ అరండల్‌పేటలోని 96 సచివాలయంలో సోమవారం జగనన్న సురక్ష శిబిరం జరిగింది. స్థానిక కార్పొరేటర్ బంకా శకుంతల భాస్కర్‌తో కలిసి ఎమ్మెల్యే విష్ణు శిబిరంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, రెవెన్యూ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమై.. వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించే మహోన్నత కార్యక్రమమే జగనన్న సురక్ష అని మల్లాది విష్ణు పేర్కొన్నారు. డివిజన్‌లోని మూడు సచివాలయాల పరిధిలో 639 వినతులు రాగా.. వీరిలో 246 మందికి కులధ్రువీకరణ, 346 మందికి ఆదాయ ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసినట్లు చెప్పారు. 10 మంది బియ్యం కార్డుల కోసం అర్జీలు సమర్పించారన్నారు. వీరందరికీ ఆయా సర్టిఫికెట్లను పూర్తి ఉచితంగా అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో యూసీడీ పీఓ శకుంతల, సెంట్రల్ తహసీల్దార్ శ్రీనివాస్ వెన్నెల, స్పెషల్ ఆఫీసర్ సీహెచ్ బాబూ శ్రీనివాసరావు, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యల పరిష్కారానికే

లబ్బీపేట(విజయవాడతూర్పు): పెండింగ్ సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని సెంట్రల్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు మల్లాది విష్ణు అన్నారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం కాంప్లెక్స్‌లోని 91వ సచివాలయంలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. 36, 88, 91, 92 సచివాలయాలకు సంబంధించి నిర్వహించిన కార్యక్రమంలో 677 మందికి వివిధ సర్టిఫికెట్లను అందజేశారు. వాటిలో కుల ధ్రువీకరణ పత్రాలు 256, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు 204, రీఇష్యూరెన్స్ 53, ఆధార్‌కార్డులు 147 మంజూరు చేయగా, రేషన్ కార్డులకు సంబంధించి 23 దరఖాస్తులు స్వీకరించారు. యూసీడీ పీఓ శకుంతల, స్పెషలాఫీసర్ నరసింహమూర్తి పర్యవేక్షించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కుక్కల అనిత కూడా పాల్గొన్నారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): అర్హులకు లబ్ధి చేకూర్చడమే జగనన్న సురక్ష లక్ష్యమని 31వ డివిజన్ కార్పొరేటర్ పెనుమత్స శిరీష తెలిపారు. ఆమె సోమవారం డివిజన్‌లో సచివాలయ సిబ్బందితో కలిసి స్థానిక సమస్యలు తెలుసుకుని 'సురక్ష'ను వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షులు పెనుమత్స సత్యం, వలంటీర్లు పాల్గొన్నారు.

వేగంగా సర్టిఫికెట్ ఇచ్చారు



నేను అరండల్ పేటలో నివసిస్తున్నాను. గతంలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం కార్యాలయాలకు వెళ్లే వాళ్లం. అక్కడ సిబ్బంది అందుబాటులో లేరని, రకరకాల పత్రాలు కావాలని రోజుల తరబడి తిప్పేవారు. ఒక పట్టాన సర్టిఫికెట్ ఇచ్చే వారు కాదు. జగనన్న సురక్ష ద్వారా సచివాలయంలో క్షణాల్లో ఆదాయ ధ్రువీకరణ జారీ చేశారు. పథకాల లబ్ధిపొందాలంటే ఆదాయ ధ్రువీకరణ అవసరం. వలంటీర్లు ఇంటికి వచ్చారు. తన అర్జీ తీసుకున్నారు. అంతే వేగంగా సర్టిఫికెట్ ఇచ్చారు.

–విద్యావతి, అరండల్ పేట

మంచి కార్యక్రమం



కుల ధ్రువీకరణ పత్రం కావాలంటే గతంలో ఆ ఇంటి పేరుతో ఎవరైనా తీసుకుంటే అది జత చేయాల్సి వచ్చేది. లేదంటే అనేక ఇబ్బందులు పడాల్సి వచ్చేది. ఇంత చేసి కార్యాలయానికి వెళితే అక్కడ పట్టించుకునే వారు కాదు. పనులు మానేసి తిరగాల్సి వచ్చేది. జగనన్న సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేశాక పూర్తిగా ఆ పరిస్థితి మారింది. క్యాంపు నిర్వహించి వేగంగా కుల ధ్రువీకరణ పత్రం ఇచ్చారు. ఇది చాలా మంచి కార్యక్రమం.

–రామకృష్ణ, అన్నదాన సమాజం రోడ్డు

కుల ధ్రువీకరణ పత్రం వచ్చింది

నాకు చేయూత పథకం కోసం కుల ధ్రువీకరణ పత్రం అవసరమైంది. ఇప్పటి వరకూ నేను సర్టిఫికెట్ తీసుకోలేదు. ఎలా తీసుకోవాలో కూడా తెలీదు. వలంటీర్ మా ఇంటికే వచ్చి వివరాలు రాసుకుని, పత్రం అందించారు.

–కామేశ్వరి, 24వ డివిజన్

నేడు 'అల్లూరి' 125వ జయంతి ముగింపు వేడుకలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విప్లవవీరుడు, దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను అర్పించిన అల్లూరి సీతారామరాజు 125వ జయంతి ముగింపు వేడుకలను మంగళవారం సాయంత్రం ఏ కన్వెన్షన్ సెంటర్‌లో కులమతాలకు అతీతంగా ఘనంగా నిర్వహించనున్నట్లు అల్లూరి సీతారామరాజు 125వ జయంతి మహోత్సవ కమిటీ కన్వీనర్ గొట్టుముక్కల రఘురామరాజు తెలిపారు. ముత్యాలంపాడు గోకరాజు రంగరాజు కల్యాణ మండపంలో సోమవారం విలేకరుల సమావేశం జరిగింది.

ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా భీమవరంలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను ప్రధాని మోదీ ప్రారంభించారన్నారు. సోమవారం జరగబోయే అల్లూరి జయంతి ముగింపు కార్యక్రమంలో అన్ని పార్టీలకు చెందిన నాయకులు, అల్లూరి సీతారామరాజు అభిమానులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ కో కన్వీనర్ బుద్ధరాజు శివాజీ, పశ్చిమ గోదావరి జిల్లా నుంచి మంతెన నరసింహరాజు, పల్నాడు జిల్లా నుంచి బలరామకృష్ణరాజు, కృష్ణా జిల్లా నుంచి సుబ్బరాజు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వలంటీర్లకు ఇంటర్వ్యూలు

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థ పరిధిలో 18వ దశలో 173 మంది వలంటీర్ల అభ్యర్థుల ఎంపిక ఈ నెల 4వ తేదీ మంగళవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నామని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్వ్యూలు పటమటలోని సర్కిల్ కార్యాలయంలో అసిస్టెంట్ కమిషనర్ చాంబర్‌లో జరుగుతాయని, ఆయా వార్డులకు సంబంధించిన అభ్యర్థులు తమకు కేటాయించిన కేంద్రంలో మౌఖిక పరీక్షకు అన్ని సర్టిఫికెట్లతో హాజరు కావాలని వివరించారు. వివరాలకు స్పెషల్ ఆఫీసర్ (వార్డ్ సెక్రటేరియట్స్) వార్డు సెక్రటేరియట్ స్పెషల్ సెల్, వీఎంసీ 8185933187 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పచ్చళ్ల కరపత్రాల కలకలం!

మధురానగర్(విజయవాడసెంట్రల్): గుణదల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆవు మాంసంతో పచ్చళ్లు అంటూ పంపిణీ చేసిన కరపత్రాలు సోమవారం గందరగోళం సృష్టించాయి. వివరాల్లోకి వెళితే మస్తానీ అనే మహిళ గుణదల కార్ల్‌మార్క్స్ రోడ్డులో డిలైట్ టేస్టీ పచ్చళ్ల పేరిట ఏర్పాటు చేసిన దుకాణం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. ప్రారంభోత్సవ కరపత్రాల్లో చికెన్, రొయ్య, మటన్, చేప, నాటుకోడి పచ్చళ్లతో పాటు ఆవుమాంసం పచ్చళ్లు కూడా ఉన్నాయని ముద్రించారు. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు సదరు పచ్చళ్ల దుకాణంలో తనిఖీలు నిర్వహించారు. నిర్వాహకురాలు మస్తానీ వివరణ కోరగా తాను బీఫ్‌తో కూడా పచ్చళ్లు చేస్తానని తెలిపారు. బీఫ్ అంటే ఆవు మాంసం అనుకుని కరపత్రాల్లో ముద్రించామని వివరణ ఇచ్చారు. తనిఖీల్లో ఆవు మాంసం లేకపోవటంతో నిర్వాహకురాలు మస్తానీకు గుణదల పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించి వేశారు.